క్లుప్తంగా

కరాటే టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరణ

అమలాపురం రూరల్: పవర్ కిక్ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురంలో సెప్టెంబర్ 14న నిర్వహించనున్న ఐదవ ఇంటర్ స్టేట్ ఇన్విటేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోస్టర్, చాంపియన్‌షిప్ ట్రోఫీని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, టీడీపీ నాయకులు గంధం పల్లంరాజు శనివారం ఆవిష్కరించారు. టోర్నమెంట్ చీఫ్ ఆర్గనైజర్ పడాల అంజి మాట్లాడుతూ ఈ పోటీలకు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 1000 మంది విద్యార్థులు పాల్గొంటున్నట్లు తెలిపారు. టోర్నమెంట్ ఆర్గనైజర్ చిక్కం సురేష్, సెక్రటరీ ఎ.రవి, కె.మానస, ఎంపీటీసీ అడపా సత్తిబాబు, దొంగ శ్రీను, ఇందుగుల ఆనంద్ పాల్గొన్నారు.

శ్రీదేవి అమ్మవారిని దర్శించుకున్న ఏఎస్పీ

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయాన్ని విజయవాడ ట్రాఫిక్ ఏఎస్పీ ఏఎల్‌వీ ప్రసన్నకుమార్ దంపతులు శనివారం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. గతంలో అమలాపురం డీఎస్పీగా ప్రసన్నకుమార్ పనిచేసిన అనుబంధంతో ఆయన పట్టణానికి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రసన్నకుమార్ దంపతులకు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యుడు, మాజీ కౌన్సిలర్ మామిడిపల్లి రాము తదితరులు ప్రసాదాన్ని అందించారు. అనంతరం ప్రసన్నకుమార్ దంపతులకు నూతన వస్త్రాలు బహూకరించి ఆలయం తరపున సత్కరించారు.

వృద్ధులకు మహిళా వాకర్ల వితరణ



వృద్ధులకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: రాఖీ పౌర్ణమి సందర్భంగా అమలాపురం మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు స్థానిక ఎస్‌కే వృద్ధాశ్రమాన్ని శనివారం సందర్శించి వృద్ధులకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి, కార్యదర్శి గోటేటి లక్ష్మి, క్లబ్ ప్రతినిధులు కొద్దిసేపు వృద్ధులతో మమేకమై వారితో కలసి రాఖీ పౌర్ణమి వేడుకలు జరుపుకున్నారు. కార్యక్రమంలో వాకర్స్ హెల్త్ క్లబ్ ప్రతనిధి జి. గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గమ్మకు పంచామృతాభిషేకం

కాట్రేనికోన: చింతలమెర గ్రామంలో విజయదుర్గాదేవి అమ్మవారికి శ్రావణ మాస పౌర్ణమి సందర్భంగా బొక్కా ఠాగూర్ నాగవెంకట జగదీష్, భవానీ దంపతుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం చేసారు. ఆలయ అర్చకుడు ఆకొండి శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో శనివారం అమ్మ వారికి కుంకుమ పూజలు చేసారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ముత్యాలమ్మకు ఘనంగా క్షీరాభిషేకం

తాళ్లరేవు: పవిత్ర శ్రావణ పౌర్ణమి పర్వదినం సందర్భంగా పి.మల్లవరం గ్రామ దేవత ముత్యాలమ్మవారికి శనివారం క్షీరాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కాట్నం సూర్యనారాయణ, అరుణ దంపతులు అమ్మవారికి క్షీరాభిషేకం, కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు ఖండవిల్లి శ్రీరంగాచార్యులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసారు. వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, కమిటీ ప్రతినిధులు ఉంగరాల వెంకటేశ్వరరావు, పితాని వీరబాబు, ధూళిపూడి సుభ పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం

ఐ.పోలవరం: శ్రావణ పౌర్ణమి సందర్భంగా శనివారం మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో చండీహోమం ఘనంగా నిర్వహించారు. 118 మంది భక్తులు చండీ హోమంలో పాల్గొన్నారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి. సత్యనారాయణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. కార్యక్రమంలో శ్రీ ఆకొండి కిరణ్ తదితరులు పాల్గొన్నారు

కంటైనర్ మద్యం దుకాణాన్ని తొలగించాలి

యానాం: నీలపల్లి-యానాం రహదారిలో పాత బస్టాండ్‌లో బస్టాప్ పక్కనే మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల మహిళలు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణం కంటైనర్ మద్యంషాపును తొలగించాలని కోరుతూ శనివారం న్యాయవాది ఖాదర్ ఆర్‌ఏఓ మునిస్వామికి ఫిర్యాదు చేశారు. సీగల్స్ సంస్థ ఆధ్వర్యంలో హోల్‌సేల్ షాపు ఏర్పాటు చేయడం వల్ల నిత్యం నియోజకవర్గ పరిధిలో వివిధ తీరప్రాంత గ్రామాల నుంచి, కాకినాడ, అమలాపురం నుంచి వచ్చే కళాశాలల, స్కూల్స్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు గురవుతారని అన్నారు. ప్రస్తుతం నెలకొల్పిన కంటైనర్ షాపు వెనుకాలే రామాలయం, నివాసాలు ఉన్నాయని తక్షణం మద్యం కంటైనర్ షాపును తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ఎల్జీ కైలాసనాథన్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు.

అదును దాటిందని ఆందోళన

- సాగు కాలం దాటిపోతోంది
- నారుమళ్లు వద్దంటున్న వ్యవసాయశాఖాధికారులు
- వెదజల్లు విధానమే మేలంటూ ఉద్బోధ



నాట్లు వేస్తున్న వ్యవసాయ కూలీలు



వెదజల్లు పద్ధతిలో విత్తనాలు జల్లుతున్న రైతు

ఐ.పోలవరం: సార్వా సాగు సమయం దాటిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది రుతుపవనాలు కొంత ఆలస్యంగా వచ్చాయి. వర్షాలు కూడా అంతంతమాత్రంగా కురవడంతో ఆయకట్టులోని చాలా ప్రాంతాల్లో రైతులు ఇంకా నాట్లు వేస్తున్నారు. కొంతమంది నారుమడులకు పొలాలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే పంట కాలం దాటి పోయినందున రైతులు నారుమడులు వేయవద్దని, వాతావరణం సహకరిస్తున్నందున వెదజల్లు విధానం పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

37,419 ఎకరాల్లో వరి సాగు

ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల పరిధిలో మొత్తం 37,419 ఎకరాల్లో వరి సాగు జరుగుతోంది. దీనిలో ఐ.పోలవరంలో 5,811, ముమ్మిడివరంలో 5,298, కాట్రేనికోనలో 5,251, కాకినాడ జిల్లా తాళ్లరేవు (తూర్పు డెల్టా) పరిధిలో 8,500 ఎకరాలు చొప్పున 24,857 ఎకరాల్లో, అమలాపురం నియోజకవర్గం పరిధిలో అల్లవరం 2,877, ఉప్పలగుప్తం 4,795, అమలాపురంలో 4,872 ఎకరాల్లో వరిసాగవుతోంది ఈ ప్రాంతంలో సుమారు 25 వేల ఎకరాల్లో మాత్రమే నాట్లు పూర్తయ్యాయని అంచనా. ప్రధానంగా అల్లవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన, ఐ.పోలవరంలో రైతులు ఇంకా నారుమడులు వేసే పనిలో ఉన్నారు. ఇప్పటికే సాగు ఆలస్యమైనందున ఇప్పుడు నారుమడులు వేస్తే రైతులు నష్టపోయే ప్రమాదముందని వ్యవసాయశాఖాధికారులు హెచ్చరిస్తున్నారు.

ఈ సమయంలో నాట్లు వేయడం వల్ల నవంబరు నెలాఖరు నుంచి డిసెంబరు 15 మధ్యన చేలు కోతలకు సిద్ధమవుతాయి. ఇప్పుడు నారుమడులు వేస్తే జనవరిలో ఖరీఫ్ కోతలు కోయాల్సి వస్తోంది. అదే జరిగితే డిసెంబరు నెలాఖరు నాటికి పూర్తి కావాల్సిన రబీ నాట్లు ఫిబ్రవరిలోనూ వేయాల్సి వస్తోంది. దీంతో రబీ సాగు చివరిలో అంటే ఏప్రిల్, మే నెలల్లో నీటి ఎద్దడి బారిన పడే ప్రమాదముందని అధికారులు చెబుతున్నారు. ఇంకా ఖరీఫ్ సాగు చేసే ఉద్దేశ్యంతో రైతులు ఉంటే వారు వెదజల్లు పద్ధతిలో సాగుకు వెళితే కొంత వరకు సమయం ఆదా అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు పెద్దగా వర్షాలు లేనందున వెదజల్లు విధానం మంచిదని కొందరు రైతులు కూడా అభిప్రాయపడుతున్నారు. వెదజల్లు పద్ధతి వల్ల పదిహేను రోజుల ముందే పంట చేతికి వస్తోందని దీని వల్ల సమయం కలిసి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాలలోని శివారు ప్రాంతాల్లో ఇప్పుడు నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో వెదజల్లు విధానం మేలని వారంటున్నారు.

వెదజల్లుతో పలు రకాల ప్రయోజనాలు



ఇప్పటికే సాగు అదనుదాటినందున కొత్తగా సాగు చేసే రైతులు వెదజల్లు పద్ధతి అవలంభించాల్సి ఉంది. ఈ విధానం వల్ల రైతులకు పలు రకాల ప్రయోజనాలు కలుగుతాయి. ఎకరాకు విత్తనం 15-18 కిలోలు ఆదా అవుతుంది. పంట 10 రోజుల ముందుగా కోతకు వస్తుంది. నారు పెంపకం, నారు పీకడం, నాట్లు వేసే పని ఉండదు. దీని వల్ల కూలీల కోసం ఎదురు తెన్నులు చూడాల్సిన పని లేదు. ఇలా చేయడం వల్ల ఎకరాకు రూ.2,500 నుంచి రూ.3 వేల వరకు ఆదా చేయవచ్చు.

– ఎం.వాణి, వ్యవసాయశాఖ అధికారి, ఐ.పోలవరం మండలం

ధర్మకర్తల మండలి ఏర్పాటుకు దరఖాస్తులు

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తల మండలి నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని ఆలయం కార్యనిర్వాహక అధికారి, సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ శనివారం తెలిపారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈనెల 7న ఈ నోటిఫికేషన్ విడుదలైందని, 20 రోజుల లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

వైఎస్సార్ సీపీ నాయకుల పరామర్శ

తాళ్లరేవు: పుత్ర వియోగంతో బాధపడుతున్న పువ్వల యేసుదాసు కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం పరామర్శించారు. జార్జిపేట పంచాయతీ ఎంఎల్‌కే నగర్ గ్రామానికి చెందిన యేసుదాసు కుమారుడు పువ్వల జయరాజ్ (సత్తిబాబు) ఇటీవల మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఆ కుటుంబాన్ని జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దడాల జగదీశ్వరరావు, స్థానిక గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డి నాగేశ్వరరావు తదితరులు పరామర్శించి ఓదార్చారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్ సీపీ నాయకుడు పువ్వల కృష్ణమూర్తిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పేర్ని ఆదినారాయణ మూర్తి, విశ్రాంత వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ పెట్ల సూర్యనారాయణరాజు, నాయకులు శీలి రాజు, దంగేటి మహేష్, నీలపాల శ్రీను, మేడిశెట్టి సూర్యనారాయణ, సత్యనారాయణ, నాగేష్, జగదీష్, నాగార్జున పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పాలి



అమలాపురంలో క్యూఆర్ కోడ్ పత్రాలను ప్రదర్శిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, నాయకులు

అమలాపురం టౌన్: సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మోసాలు, అబద్దాలను ప్రజలు గమనించి తగిన సమయంలో కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అమలాపురంలో 26,27 వార్డుల్లో పట్టణ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ×బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ× కార్యక్రమాల్లో చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి పాల్గొని ప్రసంగించారు. 26వ వార్డులో పార్టీ నాయకులు, కార్యకర్తల, ప్రజలతో పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలనపై పార్టీ నాయకులు తమ తమ ప్రసంగాల్లో విరుచుకుపడ్డారు. చంద్రబాబు మోసాలతో ఉన్న క్యూఆర్ కోడ్ పత్రాలను పార్టీ నాయకులు సమావేశంలో ప్రదర్శించి నిరసన తెలిపారు. పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖాదర్, 26,27 వార్డుల కౌన్సిలర్లు యండమూరి గంగ, బండారు గోవిందు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలకు సంబంధించిన పత్రాలను పంచారు. మున్సిపల్ కౌన్సిలర్లు సంసాని చంద్రశేఖర్, చిట్టూరి పెదబాబు, కట్టోజు సన్నయ్యదాసు, మున్సిపల్ కౌన్సిల్ విప్ బండారు సత్యనారాయణ, న్యాయవాది ఆర్.శ్రీనివాసరావు, పార్టీ నాయకులు ఉంద్రు బాబ్జి, కుడుపూడి భరత్ భూషణ్, వేగిరాజు సాయిరాజు, గోపి రమేష్, దొంగ చిన్నా, కాశే చంటి, గుత్తుల రాంబాబు, యన్నాబత్తుల సాయి, యండమూరి శ్రీను, కట్టా బుజ్జి, ఆశపు రవికుమార్ తదితరులు ఇంటింటా తిరిగి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు.

అనుబంధాలకు ప్రతీక రాఖీ పౌర్ణమి



మున్సిపల్ కమిషనర్, ట్రైనీ ఐఏఎస్ అధికారి అఖిల్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు



మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు రాఖీ కట్టి ఓంశాంతి సందేశ పత్రాన్ని అందజేస్తున్న బ్రహ్మకుమారీలు



మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి స్వరూప

అమలాపురం టౌన్: అనుబంధాలకు ప్రతీక అయిన రాఖీ పౌర్ణమి సందర్భంగా అమలాపురం ఓ శాంతి కేంద్ర కార్యాలయం ఇన్‌చార్జి, బ్రహ్మకుమారి శ్రీదేవి ఆధ్వర్యంలో బ్రహ్మకుమారి స్వరూప తదితరులు పట్టణంలోని పలువురి ప్రముఖులకు శనివారం రాఖీలు కట్టి ఆత్మీయత, అనుబంధాన్ని చాటారు. రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ ఇంటికి బ్రహ్మకుమారీలు వెళ్లి ఆయనకు రాఖీ కట్టారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు, మున్సిపల్ చైర్‌పర్సర్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు పినిపే విశ్వరూప్ సతీమణి, మీనాక్షి ఫౌండేషన్ చైర్‌పర్సన్ బేబీ మీనాక్షికి, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, బీవీసీ ఇంజినీరింగ్ విద్యా సంస్థల చైర్మన్ బోనం కనకయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు పితాని బాలకృష్ణకు బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టారు. ఇన్‌చార్జి డీఆర్వో, అమలాపురం ఆర్డీవో కొత్త మాధవికి కూడా రాఖీ కట్టారు. నుదట తిలకం దిద్ది రాఖీలు కట్టి తమ ఆత్మీయతను చాటారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలో ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ ఇంటికి బ్రహ్మకుమారీలు వెళ్లి ఆయనకు రాఖీ కట్టారు. బ్రహ్మకుమారీలతో పాటు బ్రహ్మకుమారులు శ్రీనివాసరావు (మాజీ సర్వేయర్), జి.శ్రీనివాసరావు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో రక్షాబంధన్

యానాం: రాఖీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా శనివారం యానాంలో ఆనందోత్సాహాలతో రక్షా బంధన్‌ను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, ట్రైనీ ఐఏఎస్ అధికారి బుద్ధి అఖిల్‌కు బ్రహ్మకుమారీలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబద్రానగర్, బ్రహ్మకుమారీస్ గీతా పాఠశాల బీకే దుర్గ, సరస్వతి, బీకే నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో..

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం కొత్తకాలనీ గురుకుల పాఠశాల ప్రక్కన మత్స్యకార గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ కన్వీనర్ పంతాడి సూర్యనారాయణ ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. ధార్మిక సమితి సభ్యులు మాతృమూర్తులు, విద్యార్థులు పాల్గొని పలువురికి రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ధర్మ ప్రచారక్ కనకారావు మాట్లాడుతూ రక్షా బంధన్ విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంతాడి సావిత్రి, బలసాడి నాగవేణి, బలసాడి మంగాదేవి, పల్లప్రోలు రమ్య, పంతాడి సుజాత, పంపాడి గంగా వీరవేణి పాల్గొన్నారు.

బుద్ధుడి బోధనలు ప్రపంచ శాంతికి దోహదం



అమలాపురం త్రిరత్న బుద్ధి విహార్‌లో మాట్లాడుతున్న డీబీ లోక్

అమలాపురం రూరల్: స్థానిక త్రిరత్న బుద్ధి విహార్‌లో బౌద్ధ శ్రావణ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం బుద్ధుని విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా బుద్ధి విహార్ జనరల్ సెక్రటరీ డీబీ లోక్ మాట్లాడుతూ గౌతమబుద్ధుడి బోధనలు ప్రపంచ శాంతి దోహదపడతాయన్నారు. బుద్ధభగవానుడు 30వేల మంది శిష్యులను ధర్మ బోధనల కోసం శ్రావణ పౌర్ణమిరోజునే ప్రపంచ దేశాలకు పంపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో బుద్ధ విహార్ కమిటీ చైర్మన్ నాగబత్తుల ప్రసాదరావు, ప్రతినిధులు కాశి వెంకట్రావు, కొడూరి రామమూర్తి, డి.నాగేశ్వరరరావు తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి తిరంగా యాత్రలు




తిరంగా యాత్ర కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ, పవర్‌కుమార్ తదితరులు

అమలాపురం రూరల్: ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు యువత, మహిళలతో ప్రతి మండలంలో తిరంగా యాత్రలు నిర్వహించాలి బీజేపీ జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు నల్లా పవన్ కుమార్ పిలుపునిచ్చారు. అమలాపురం బీజేపీ నూతన పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ అధ్యక్షతన జిల్లాలో మండలాల అధ్యక్షులు, జిల్లా పార్టీ పదాధికారులు, ఇన్‌చార్జిలతో శనివారం సమావేశం నిర్వహించారు. నల్లా పవన్ హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి జోనల్ ఇన్‌చార్జిగా నియమించినందుకు పార్టీ నాయకులు ఆయనను అభినందనలు తెలిపారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ జాతీయ పార్టీ ఆదేశాల మేరకు 12 నుంచి 14 వరకు స్వాతంత్ర పోరాట స్మారక చిహ్నాలు, యుద్ధ స్మారకాలను శుభ్రపరచి పూలతో నివాళులు అర్పించాలన్నారు. 13 నుంచి 15 వరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేసి, 14న విభజన్ విభిషిక స్మృతి దివస్, మౌన ర్యాలీలు, ఫొటో ప్రదర్శన, సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు కొప్పనాతి దత్తాత్రేయ, చీకురుమెల్లి శ్రీనివాసరావు, సలాది వీరబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి వెంకటేశ్వరరావు, ప్రోగ్రాం జిల్లా ఇన్‌చార్జి బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన జీపు

అమలాపురం రూరల్: నడిపూడిలో కొంతమంది యువకులు శనివారం జీపులో రోడ్లపై తిరుగుతూ హల్‌చల్ చేశారు. ఈ క్రమంలో జీపు వాహనం అదుపుతప్పి దుకాణంలోకి దూసుకెళ్లింది. లాకు వద్ద జరిగిన ఈ ప్రమాదంలో దుకాణం పాక్షికంగా దెబ్బతినడంతోపాటు అక్కడ రోడ్డు పక్కన నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని స్థానికులు తెలిపారు. ఉదయం నుంచి కొంతమంది యువకులు ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తీసివేసి రోడ్లపై తిరగడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ప్రమాద ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీవీసీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేస్తున్న జేఎన్‌టీయూకే డైరెక్టర్ ఆఫ్ అకాడమిక్స్ ఎంహెచ్‌ఎం కృష్ణ

అల్లవరం: ఓడలరేవు బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో 2021-25 విద్యా సంవత్సరంలో బీటెక్ విద్యను అభ్యసించి ఉత్తీర్ణత సాధించిన 632 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టా ప్రదానోత్సవం, సుమారు 378 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ప్లేస్‌మెంట్ సాధించిన నేపథ్యంలో అచీవర్స్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బీవీసీ ప్రిన్సిపాల్ మహేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాకినాడ జేఎన్‌టీయూకే డైరెక్టర్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ ఎంహెచ్‌ఎం కృష్ణ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. సంస్థ చైర్మన్ కృష్ణ సతీష్ మాట్లాడుతూ బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల విజయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, బీవీసీ కరస్పాండెంట్ బోనం కనకయ్య, వైఎస్ చైర్మన్ కనక దుర్గ, వైఎస్ ప్రిన్సిపాల్ ప్రవీణ్, గవర్నింగ్ బాడీ మెంబర్ బోనం కృష్ణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ బి.శ్రీనివాస్, ఐఐఐసీ డాక్టర్ రాజశేఖర్, ఏఓ ఏవైఆర్‌వీ ప్రసాదు, బీవీసీఐటీఎస్ ప్రిన్సిపాల్ టీవీ జనార్ధనరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు

తాళ్లరేవు: పవిత్ర శ్రావణమాసం, పౌర్ణమి పర్వదినం, శ్రవణా నక్షత్రం సందర్భంగా శనివారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని పి.మల్లవరంలో కొలువై ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించున్నారు.

వైభవంగా పరదేశమ్మ జాతర

తాళ్లరేవు: గ్రామదేవత పరదేశమ్మ అమ్మవారి జాతరను తాళ్లరేవులో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి పెద్ద జాతర, గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. పరదేశమ్మమ్మవారి ఆలయంతోపాటు స్థానిక మార్కెట్ వీధిలో ఏర్పాటు చేసిన అమ్మవారి అంగన్‌గుడిని విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

దొంగకు గ్రామస్తుల దేహశుద్ధి

మామిడికుదురు: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం చేసి పట్టుబడ్డ దొంగకు దేహశుద్ధి చేసిన సంఘటన ఈదరాడ గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. కొబ్బరి కాయల వ్యాపారి లంకలపల్లి సూర్యనారాయణ వైద్య పరీక్షల కోసం ఇటీవల భార్యతో కలిసి హైదరాబాదు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకున్న పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం పెనుమంచిలికి చెందిన మార్గని గోపాలకృష్ణ ఈ నెల 3వ తేదీన దొంగతనానికి పాల్పడ్డాడు. దొంగతనం చేసి పారిపోయే ప్రయత్నంలో అతను గ్రామస్తులకు పట్టుబడ్డాడు. ఈ నేపథ్యంలో స్థానికులు దేహశుద్ధి చేసి నగరం పోలీసులకు అప్పగించారు. అతని వద్ద నుంచి రూ.8 వేలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాధితుడి అల్లుడు యెరుబండి గోవింద విజయ రామ్మూర్తి ఫిర్యాదు మేరకు ఈ నెల 4వ తేదీన కేసు నమోదు చేశామని ఎస్సై ఎ.చైతన్యకుమార్ శనివారం తెలిపారు. నిందితుడిని కోర్టుకు తరలించగా రిమాండు విధించిందని పట్టుబడ్డ దొంగ పాత నేరస్థుడని పేర్కొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ కె.తిరుపతిరాజు ఓ ప్రకటనలో తెలిపారు. చినపేటకు చెందిన రాకాపు వెంకటరెడ్డిని అదే గ్రామానికి చెందిన రాకాపు కార్తిక్ అకారణంగా కొట్టడంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ వెల్లడించారు.

మహేష్‌బాబు అభిమానుల రక్తదానం

అమలాపురం టౌన్: సినీ హీరో మహేష్‌బాబు జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు అమలాపురం పట్టణంలో పలు కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో మహేష్‌బాబు అభిమానాల సంఘాల ప్రతినిధులు సంసాని రమేష్, దొంగ శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, టీడీపీ నాయకుడు గంధం పల్లంరాజు పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పలువురు మహేష్ అభిమానులు రక్తదానం చేశారు. స్థానిక లలిత థియేటర్ వద్ద దొంగ బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహేష్‌బాబు జన్మదిన వేడుకలకు వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గొవ్వాల రాజేష్, మండల వైఎస్సార్ సీపీ యువజన అధ్యక్షుడు కేతా భాను తేజ, పార్టీ నాయకుడు పాటి రవి, మహేష్‌బాబు అభిమాన సంఘాల ప్రతనిధులు కొప్పిశెట్టి నరసింహమూర్తి, కాలే గోవిందు, బొక్కా పండు, దొమ్మేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గోడిలంక భవిత కేంద్రంలో..

అల్లవరం: గోడిలంక భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల సమక్షంలో హీరో మహేష్‌బాబు పుట్టిన రోజు వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కడలి పృథ్వీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనందరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక అవసరాల గల పిల్లలతో కలసి ఎమ్మెల్యే ఆనందరావు కేక్ కట్ చేశారు. ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు రూ. 5 వేలు విలువ చేసే క్రీడా సామగ్రిని దివ్యాంగులకు అందించారు. శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ, వేగిరాజు శ్రీను, రుద్రరాజు రవిరాజు, కడలి బాలాజీ, కడలి వినయ్, కుడుపూడి రామకృష్ణ, చొల్లంగి వెంకటరమణ పాల్గొన్నారు.

రోగులకు పాలు పండ్లు, వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

ముమ్మిడివరం: సినీ హీరో మహేష్‌బాబు పుట్టిన రోజు వేడుకలు శనివారం ముమ్మిడివరంలో ఘనంగా నిర్వహించారు.అంబేడ్కర్ కమ్యునిటీ హాల్‌లో మహేష్‌బాబు అభిమాన సంఘం అధ్యక్షుడు పిల్లి నాగరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. బుద్ధ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో మహేష్‌బాబు అభిమానులు రక్తదానం చేశారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పాలు పండ్లు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వైస్ ప్రెసిడెంట్ జంగా కొండ, యల్లమిల్లి చంటి తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీట్లలో యానాం విద్యార్థులకు అన్యాయం

యానాం: పుదుచ్చేరి సెంట్రలైజ్డ్ అడ్మిషన్ కమిటీ (సెంటాక్) ఆధ్వర్యంలో చేపట్టిన ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపులో యానాం రీజియన్ ఎంబీసీ (మోస్ట్ బ్యాక్‌వర్డ్ కమ్యూనిటీ) విద్యార్థులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని తక్షణం ఈ సమస్యను పుదుచ్చేరి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని శనివారం పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను డిమాండ్ చేశారు. 20 ఏళ్లుగా యానాం రీజియన్‌కు జనరల్ సీట్లు 2, ఎంబీసీ 1, ఎస్సీ 1 కేటాయించేవారని అన్నారు. ఈ ఏడాది నుంచి జనరల్ 1, ఈడబ్ల్యూఎస్ 1, ఎస్సీ 1, ఓబీసీ 1 సీటు కేటాయిస్తున్నారని, ఎంబీసీ విద్యార్థులకు సీట్లు కేటాయించడం లేదన్నారు. ఎంబీసీలో ఎక్కువగా మత్స్యకారులకు ఉన్నారని వారు అన్యాయానికి గురువుతున్నారన్నారు. జనరల్ అభ్యర్థులకు ఒక సీటు కేటాయిస్తున్నందున ఈడబ్ల్యూఎస్ సీటు ఆవశ్యకత లేదన్నారు. 24 ఏళ్లగా యానాంకు కేవలం 4 సీట్లు మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. ఇందిరాగాంధీ మెడికల్ కళాశాలలో 180 సీట్లు ఉండగా ప్రభుత్వ కోటా 131, ఆల్ ఇండియాకోటా 27, ఎన్ఆర్ఐ కోటా 22 సీట్లు కేటాయిస్తున్నారన్నారు. ఇందులో పుదుచ్చేరికి-98, కారైకల్-24, యానాం-4 సీట్లు కేటాయిస్తున్నారన్నారు. జనాభా ప్రాతిపదికన కేటాయిస్తున్న సీట్లలో యానాం జనాభా 30 ఏళ్లగా పెరిగినప్పటికీ సీట్ల కేటాయింపు 3శాతం మాత్రమే ఉందని పలువురు అన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్: పట్టణంలో ఇటీవల నిర్మించిన 12 విద్యుత్ టవర్లకు కొత్త లైన్లు వేయడానికి మంగళవారం, బుధవారం, గురువారం మూడు రోజులు పాటు ఈదరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ముమ్మిడివరం గేట్ ఫీడర్ అన్ని ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. ముమ్మిడివరం గేట్ ఫీడర్‌లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. ఈదరపల్లి నుంచి ముమ్మిడివరం గేట్ వరకు మెయిన్ రోడ్డు, సీతాపతిరావు పేట, మున్సిపల్ కాలనీ, కాయగూరలు మార్కెట్, దేవాంగులవీధి, సర్కులర్ బజార్ ప్రాంతాలు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ రాంబాబు తెలిపారు.